క్లుప్తంగా

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి


మృతి చెందిన దూదేకుల సిద్దయ్య

కంభం: గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి అనంతపురం–అమరావతి హైవేపై జంగంగుంట్ల సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. యర్రగొండపాలెంకు చెందిన దూదేకుల సిద్దయ్య(45) తన ద్విచక్ర వాహనంపై కంభం వైపు వస్తుండగా మండలంలోని జంగంగుంట్ల గ్రామ సమీపంలో హైవే రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలు కాగా హైవే అంబులెన్స్‌లో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ సిద్దయ్య మృతి చెందారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై బి.నరసింహారావు పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి


మాట్లాడుతున్న సీఐ మల్లికార్జున

బేస్తవారిపేట: రోడ్డు భద్రత నియమాలను పాటించడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చని కంభం సీఐ కె.మల్లికార్జున పేర్కొన్నారు. బుధవారం స్థానిక కస్తూర్బా గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, డ్రగ్స్, మహిళల రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మైనర్లకు తల్లిదండ్రులు ద్విచక్రవాహనాలు ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అపరిచితులకు ఓటీపీ చెప్పవద్దని, సెల్‌ఫోన్లకు వచ్చే అనవసర వెబ్‌లింక్‌లు ఓపెన్ చేయడం వల్ల అనేక సమస్యలు వస్తాయన్నారు. వాట్సప్‌లో ఎవరైన బెదిరింపులకు పాల్పడినా, అసభ్యకరమైన మెసేజ్‌లు పెట్టినా పోలీసులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్వీ రవీంద్రారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సత్యవతి పాల్గొన్నారు.

పక్కాగా పశువుల లెక్క!

- కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పశువుల సంఖ్యపై సర్వే
- 3,06,848 కుటుంబాలను సర్వే చేస్తున్న 156 మంది ఎన్యూమరేటర్లు
- పశ్చిమ ప్రకాశంలో ఇప్పటి వరకు 7 శాతం పూర్తి


జీవాలను లెక్కిస్తున్న అధికారులు

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరుతోపాటు కనిగిరి నియోజకవర్గాల్లో పశుగణన కార్యక్రమం ప్రారంభమైంది. మార్కాపురం పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ పరిధిలో ఉన్న 22 మండలాల్లో సుమారు 3,06,848 కుటుంబాల్లో ఉన్న గేదెలు, ఆవులు, దూడలు, ఎద్దులు, కోళ్లు, కుక్కలు, పందులు, గొర్రెలు, మేకలు తదితర జంతు జీవజాలంపై ఎన్యూమరేటర్లు సర్వే నిర్వహిస్తున్నారు. మొత్తం 16 రకాల జీవాలపై సర్వే సాగుతోంది. ఇందు కోసం మొత్తం 156 మంది ఎన్యూమరేటర్లను ప్రభుత్వం నియమించింది. ఇందులో గ్రామీణ ప్రాంతాలకు 135 మంది, పట్టణప్రాంతాలకు 21 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. 2011 లెక్కల ప్రకారం సర్వే జరుగుతున్నప్పటికీ కొత్తగా వచ్చిన గృహాల్లోనూ ఉన్న జంతుజీవాలను లెక్కించనున్నారు. పశ్చిమ ప్రకాశంలో ఇప్పటికే 35,456 ఆవులు, ఎద్దులు, 3,76,520 గేదెలు ఉన్నట్లు అంచనా. నవంబరు 1 నుంచి ప్రారంభమైన పశుగణన వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు సాగనుంది. రోజూ సుమారు 30 ఇళ్ల వరకు సర్వే చేయాలి. ఒక్కో ఎన్యూ మరేటర్ పరిధిలో గ్రామాల్లో అయితే 2 వేల గృహాలు, పట్టణ ప్రాంతాల్లో అయితే 6 నుంచి 7 వేల ఇళ్లకు వెళ్లి జంతువులతోపాటు వ్యవసాయ, పసుసంవర్ధకశాఖ సంబంధిత యంత్రాలనూ లెక్కించేలా అధికారులు చర్యలు చేపట్టారు.


ఇంటింటి సర్వేలో పాల్గొన్న అధికారులు

ఇవీ లాభాలు పశ్చిమ ప్రకాశంలోని 52 డిస్పెన్సరీలు, 32 గ్రామీణ పశువైద్యశాలల పరిధిలో ఇప్పటి వరకు 7 శాతానికి పైగా ఎన్యూమరేషన్ పూర్తయినట్లు పశు సంవర్ధక శాఖ ఏడీ బాలూ నాయక్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో దేశ వ్యాప్తంగా సాగుతున్న ఈ సర్వేతో పశుపోషకులకు మేలు కలుగుతుందని అధికారులు చెబుతున్నారు. పాలిచ్చే పశువులు, ఆవులు, పాల ఉత్పత్తి, వాటికి కావాల్సిన మందుల బడ్జెట్, మాంసం ఉత్పత్తిని పెంచేందుకు సర్వే దోహదపడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. గ్రామస్థాయిలో ఉండే పశువైద్య సిబ్బంది రోజువారీ సేవలందిస్తూనే మిగిలిన సమయాల్లో సర్వే నిర్వహిస్తున్నారు. పూర్తిచేసిన ఇళ్లకు స్టిక్కర్లు అంటిస్తారు. అలాగే వారి శాఖకు సంబంధించిన యాప్‌లో నమోదు చేస్తున్నారు.

> **అన్ని విధాలా ఉపయోగం**
> పశ్చిమ ప్రకాశంలో శిక్షణ పొందిన ఎన్యూమరేటర్లు, సిబ్బంది పశు గణన సర్వేలో పాలుపంచుకుంటున్నారు. మార్కాపురం ఏడీ పరిధిలో 21 మంది సిబ్బంది సర్వే చేస్తున్నారు. ముఖ్యంగా పాల ఉత్పత్తి, మాంసం ఉత్పత్తి ఎంత వరకు వస్తుందో సర్వే ద్వారా తెలుస్తుంది. పశువులకు అవసరమైన మందుల బడ్జెట్‌ను అంచనా వేసుకోవచ్చు. సర్వేకు పశుపోషకులు సహకరించాలి.
> – డాక్టర్ బాలూనాయక్, ఏడీ, మార్కాపురం

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

- డీఎస్పీ నాగరాజు


మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

మార్కాపురం: యువత మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు సూచించారు. బుధవారం స్థానిక ఏ1 గ్లోబల్ కళాశాలలో చైర్మన్ డాక్టర్ షంషేర్ ఆలీబేగ్ అధ్యక్షతన నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మద్యం సేవించవద్దని, హెల్మెట్ లేకుండా, ఫోన్ మాట్లాడుతూ టూవీలర్స్ నడపవద్దని సూచించారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, వీటిపై యువత అవగాహనతోపాటు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లో తెలియని వ్యక్తులు పంపే గ్రూపుల్లో జాయిన్ కావడం, లింకులు ఓపెన్ చేయడం, బ్యాంకు అధికారుల పేరుతో వచ్చే ఫోన్లకు రెస్పాన్స్ అయి ఓటీపీలు చెప్పడం లాంటివి చేయవద్దన్నారు. అగంతకులు ఎవరైనా ఫోన్లలో బెదిరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు. కళాశాలలో యాంటి ర్యాగింగ్ టీమును ఏర్పాటు చేశామని, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో చదువుకోవాలని చైర్మన్ ఆలీబేగ్ హితవు పలికారు. వివిధ కాంపిటేటీవ్ పరీక్షలకు సిద్ధమయ్యేవారి కోసం లైబ్రరీని అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్సై అంకమరావు హెచ్చరించారు. డైరెక్టర్ మసూద్ అలీబేగ్, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో నాగేంద్ర స్వామి కల్యాణం


హాజరైన భక్తులు


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మార్కాపురం: స్థానిక అల్లూరి పోలేరమ్మ దేవస్థానం ఆవరణలో నాగినీ సమేత నాగమయ్య స్వామి ఉపాలయంలో బుధవారం నాగమయ్య కల్యాణాన్ని అర్చకులు పొన్నతోట శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గత 30 ఏళ్లుగా కార్తీక మాస బహుళ పంచమి రోజున కల్యాణోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కల్యాణానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు. నిర్వాహకులు సాగర్ ఆచారి, బాల కోటయ్య ఆచారి, దీపక్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పురాతన ఆలయంలో హుండీ చోరీ


పురాతన శివాలయం


పగులగొట్టిన హుండీ

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు పంచాయతీ అంబాపురంలోని పురాతన ఆలయమైన అంబ బాలత్రిపుర సుందరిదేవి ఆలయంలో దుండగులు హుండీని పగులగొట్టి నగదు అపహరించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు బుధవారం ఉదయం ఆలయానికి చేరుకొని పరిశీలించారు. దొంగలు ఆలయ గోడదూకి లోపల ప్రవేశించి హుండీ పగలగొట్టారని గుర్తించారు. హుండీలో సుమారు రూ.20 వేల వరకు నగదు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని పరిసరాలు పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడి వివరాలు సేకరించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా ఈ ఏడాది ఏప్రిల్‌లో గ్రామానికి కొంత దూరంలో ఉన్న ఆలయంలో కూడా గుప్త నిధుల కోసం దుండగులు గోడలు పగులగొట్టారు. మళ్లీ ఇప్పుడు దొంగలు హుండీ పగులగొట్టడంపై గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతుల అందజేత


బహుమతి అందిస్తున్న డీఎం నరసింహులు

మార్కాపురం టౌన్: ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు పేర్కొన్నారు. మార్కాపురం నుంచి గుండంచర్ల వెళ్లే ఆర్టీసీ బస్సులో ప్రయాణికులకు ప్రతి 15 రోజులరోసారి లక్కీ డిప్ ద్వారా బహుమతులు అందిస్తున్నామన్నారు. బుధవారం నిర్వహించిన లక్కీడ్రాలో గుండంచర్ల గ్రామానికి చెందిన జి.గురవయ్య, పుచ్చకాయలపల్లికి చెందిన ఈస్టర్ బహుమతులు గెలుపొందినట్లు చెప్పారు.

రైల్వేస్టేషన్‌లో దాహం కేకలు!


కుళాయిల్లో నీరు రావడం లేదని చూపుతున్న ప్రయాణికులు

మార్కాపురం రూరల్: మార్కాపురం రోడ్ రైల్వేస్టేషన్‌లో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. రైల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లి వచ్చే ప్రయాణికులు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. గత మూడు రోజుల నుంచి ఉత్తరాంధ్ర నుంచి శ్రీశైలం వెళ్లే యాత్రికులు మార్కాపురం రైల్వేస్టేషన్‌లో దిగి బాటిల్స్ తీసుకుని స్టేషన్‌లో ఉన్న కుళాయిల వద్దకు వెళ్తే చుక్క నీరు రాక ఇబ్బంది పడుతున్నారు. రైల్వే అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రైనేజీ, ఫుట్‌పాత్‌లు ప్రభుత్వమే నిర్మించాలి


ధర్నాలో నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

పొదిలి: పట్టణంలో ప్రధాన రహదారి వెంట డ్రైనేజీ, ఫుట్‌పాత్‌లను ప్రభుత్వ నిధులతోనే నగర పంచాయతీ అధికారులు నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. పొదిలి నగర పంచాయతీగా మారి నాలుగేళ్లు గడుస్తున్నప్పటికీ కనీస మౌలిక సదుపాయాలకు కూడా నోచుకోలేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రధాన రహదారులు చెరువులను తలపిస్తున్నాయని విమర్శించారు. ఎవరి దుకాణం ముందు వారే డ్రైనేజీ నిర్మించుకోవాలని అధికారులు చెప్పడాన్ని తప్పుబట్టారు. ప్రజలపై ఇలా భారం మోపడం దుర్మార్గమన్నారు. ఆక్రమణల పేరుతో చిరు వ్యాపారుల ఉపాధిని అధికారులు దెబ్బతీశారని, వారికి ప్రత్యమ్నాయం చూపాల్సిన అవసరం ఉందన్నారు. ధర్నాకు అధ్యక్షత వహించిన ప్రాంతీయ కమిటీ కన్వీనర్ బాలనరసయ్య మాట్లాడుతూ.. మార్కాపురం అడ్డరోడ్డు నుంచి, కాటూరివారిపాలెం వరకు ప్రధాన రహదారిపై డివైడర్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ స్తంభాలను రోడ్డు మార్జిన్లకు మార్చి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. పెద్ద బస్టాండ్‌లో బస్ షెల్టర్ ఏర్పాటు చేయడంతోపాటు, చిన్న బస్టాండ్, పెద్ద బస్టాండ్‌లో సులభ్ కాంప్లెక్స్‌లు నిర్మించాలన్నారు. తక్షణమే ఈ సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.చార్లెస్, జి.నరసింహారావు, ఎస్.వెంకటేశ్వరరెడ్డి, ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిశీలించిన జేసీ


భూములను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

పొదిలి: నగర పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూములను జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ బుధవారం పరిశీలించారు. సర్వే నంబర్ 1309, 1310లో మొత్తం 14 ఎకరాల భూమిని కోర్టు ఆదేశాల మేరకు ఇటీవల ఆక్రమణదారుల నుంచి ప్రభుత్వం తీసుకుంది. సంబంధిత భూములను ఎన్టీఆర్ టౌన్‌షిప్ కోసం ప్రతిపాదించినట్లు జేసీ పేర్కొన్నారు. కర్నూలు–ఒంగోలు రోడ్డు పక్కనే కాటూరివారిపాలెం సమీపంలో గల ఈ భూముల రికార్డులను జేసీ తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి, మండల సర్వేయర్ గురవయ్య, వీఆర్‌ఓలు ఉన్నారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

- మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, కమిషనర్ నారాయణరావు

మార్కాపురం: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, కమిషనర్ నారాయణరావు పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రేడ్–1 లైబ్రేరియన్ జీవీ శివారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ.. విద్యార్థులు గ్రంథాలయాల్లో సభ్యులుగా చేరి పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. గ్రంథాలయాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని చెప్పారు. గ్రంథాలయాల పన్నును త్వరలో చెల్లిస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయాలకు పంపాలని లైబ్రేరియన్ కోరారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎ.వీరారెడ్డి, ఓపీ మల్లిక్, కె.విజయలక్ష్మి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడు: గ్రంథాలయాలను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ సుజాత సూచించారు. వివిధ పోటీల్లో విజేతలైన 130 మంది విద్యార్థులు బహుమతులు అందించారు. ఎంఈఓ–2 సుబ్బారావు, హైస్కూల్ హెచ్ఎం ఆనంద్, ఉపాధ్యాయులు సంజీవ్, పుల్లయ్య, గురవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రాచర్లలో బహుమతులు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి

గిద్దలూరు రూరల్: లక్ష్యం లేని చదువు వ్యర్థమని స్థానిక కమిషనర్ డి.వెంకటదాసు పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో సరస్వతి విగ్రహానికి పూలమాల వేశారు. విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గ్రంథపాలకురాలు ఎస్.ప్రసన్నకుమారి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పి.స్వరూపారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయ ఉద్యోగస్తుల సంఘం అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బీఎస్ నారాయణరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు రామిరెడ్డి, ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయుడు మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంభం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు స్థానిక భ్రమరాంబ ఎయిడెడ్ స్కూల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కాల్వ శ్రీలక్ష్మి, గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు రమేష్, గోపాల్ రెడ్డి, కేశవస్వామి తదితరులు పాల్గొన్నారు.


మార్కాపురంలో విజేతలకు బహుమతులిస్తున్న మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ

రాచర్ల: స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంపీడీవో వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేశారు. గ్రంథాలయాల్లో విజ్ఞానాన్ని పెంపొందించే విలువైన పుస్తకాలు, వార్తా పత్రికలు చదవాలని సూచించారు. ఎంఈఓలు వారణాసి గిరిధర్‌శర్మ, శివకోటేశ్వరరావు, పశువైద్యాధికారి హరిబాబు, యూఆర్టీ వెంకటేష్, స్పందన విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ పేర్ల సుధీర్‌కుమార్ రెడ్డి, గ్రంథపాలకుడు శ్రీధర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మా నిధులు మాకివ్వండి


ఎంపీడీఓతో మాట్లాడుతున్న సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు

- గ్రామాల్లో పాలన కుంటుపడుతోంది
- ఎంపీడీఓ ఎదుట సర్పంచ్‌ల ఆవేదన

కంభం: ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన సర్పంచ్‌ల హక్కులను కాలరాసేలా అధికారులు వ్యవహరిస్తుండటంతో గ్రామాల్లో పాలన కుంటుపడిపోతోందని మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం సర్పంచులు, ఎంపీటీసీలు ఎంపీడీఓ వీరభద్రాచారిని కలిసి తమకు రావాల్సిన నిధులు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి రెండు పర్యాయాలు వచ్చిన నిధులను ఇవ్వకుంటే గ్రామాల్లో పాలన ఎలా సాగుతుందని ప్రశ్నించారు. 8 నెలల నుంచి గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే టర్న్‌కాక్‌లు, పారిశుద్ధ్య కార్మికులు, స్వీపర్లు, క్లాప్ మిత్రలకు నగదు లేక వేతనం ఇవ్వడం లేదన్నారు. పంచాయతీల్లో మోటార్లు చెడిపోయినా, విద్యుత్ సమస్యలు తలెత్తినా, ఇతర ఏ సమస్యలు వచ్చినా అప్పు చేసి పరిష్కరించాల్సి వస్తోందన్నారు. తాము చేసిన పనులకు మాత్రమే బిల్లులివ్వాలని అడుగుతున్నామని, అవి కూడా నిలిపేస్తే ఎలా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలక్షన్ కోడ్ వచ్చిన నాటి నుంచి సర్పంచులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు ఉండాలని, నూతనంగా చేపట్టబోతున్న అభివృద్ధి పనులకు తాము సహకరిస్తున్నప్పుడు తమను ఎందుకు ఇబ్బంది పెడుతున్నారన్నారని నిలదీశారు.


విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

- జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి శుభవాణి


మాట్లాడుతున్న న్యాయమూర్తి శుభవాణి

మార్కాపురం టౌన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరుచుకుని ముందుకు సాగాలని మార్కాపురం జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి ఎం.శుభవాణి పేర్కొన్నారు. బుధవారం అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బీసీ బాలుల హాస్టల్‌ను న్యాయమూర్తి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. ఆంగ్లంలో మాట్లాడేందుకు ప్రయత్నించాలని, చదువుపై మాత్రమే దృష్టి సారించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. భవనం పాతదైనందున కొత్త భవనమైతే మౌలిక వసతులు మెరుగ్గా ఉంటాయని అభిప్రాయపడ్డారు. న్యాయమూర్తి వెంట న్యాయవాది అన్వర్ బేగ్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అనిల్‌రాజు, గురవయ్య తదితరులు ఉన్నారు. వసతి గృహ సంక్షేమాధికారికి పలు సూచనలిచ్చారు.

బాలలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దాలి


విద్యార్థులకు వాటర్‌బాటిల్ పంపిణీ చేస్తున్న ఎంఈఓ గిరిధర్‌శర్మ

రాచర్ల: బాలలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దాలని ఎంఈఓ వారణాసి గిరిధర్‌శర్మ సూచించారు. మండల కేంద్రమైన రాచర్ల ఏబీఎం కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం బంగారు బాల్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 శివకోటేశ్వరరావు, హెచ్ఎం బి.వసంత తదితరులు పాల్గొన్నారు.

లాడ్జిల్లో పోలీసుల తనిఖీ


లాడ్జిలో తనిఖీ చేస్తున్న ఎస్సై

కంభం: పట్టణంలోని పలు లాడ్జీలను బుధవారం పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. గదులను పరిశీలించి, అద్దెకు తీసుకున్న వారి వివరాలు ఆరాతీశారు. గదులను కేటాయించే సమయంలో సంబంధిత వ్యక్తుల పూర్తి సమాచారం తీసుకోవాలని నిర్వాహకులకు ఎస్సై బి.నరసింహారావు సూచించారు. లాడ్జిల్లో పేకాట, మద్యం, ఇతర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.